క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడ, సతివాడ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ త్రినాధరావు ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల్లో భాగంగా మధుపాడ, పినతరిమి, పెదతరిమి, బొడ్డపేట, ఒమ్మి, బొప్పడాం, వల్లూరు, మల్యాడ, వెంకన్నపాలెం గ్రామాలతో పాటు కొండవెలగాడ సబ్‌స్టేషన్ పరిధిలోని చిన్నబూరాడపేట, పారసాం, గెద్దపేట, గుర్ల మండలంలోని నడుపూరు, భూపాళపురం, ఆనందపురం గ్రామాలకు కరెంట్ సరఫరా ఉండదన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ అసౌకర్యం ఉటుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అన్నసమారాధన

విజయనగరం టౌన్: స్థానిక కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ వద్ద ఉన్న శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ఆవరణలో అన్నసమారాధన ఆదివారం నిర్వహించారు. మాస శివరాత్రి పురస్కరించుకుని, ఆలయ కమిటీ చైర్మన్ రెయ్యి శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రెండు వేల మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని, స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.పద్మావతి, ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రసాద్, శోభారాణి, భీమ, సోమశేఖర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరికి ప్రత్యేక పూజలు


అమ్మవారికి గుడికి వెళ్తున్న భక్తులు

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి గల రాజరాజేశ్వరిదేవికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు ప్రభలు, ఘటాలతో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకుడు దూసి శ్రీధర్‌శర్మ భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

పంపిణీకి సిద్ధమైన మొక్కలు


నర్సరీలో పెంచిన మొక్కలు


బొండపల్లి: మండల కేంద్రంలోని వనమిత్ర నర్సరీలో వివిధ రకాల మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. వనమిత్ర నర్సరీలో ఈ ఏడాది లక్షా 25 వేల మొక్కలు పెంచారు. కాగు, వేప, బాదం, తదితర మొక్కలను గతేడాది నుంచి పెంచుతున్నారు. ఈ ఏడాది జూన్ నుంచి వర్షాలు ప్రారంభమైన తర్వాత 50 వేల మొక్కలను రైతులకు.. అలాగే ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్లకు ఇరువైపులా నాటేందుకు మరో 25 వేల మొక్కలను సిద్ధం చేశారు. మొక్కలు కావాల్సిన రైతులు పంచాయతీ కార్యదర్శులను సంప్రదించాలని నర్సరీ నిర్వాహకులు చెబుతున్నారు.

కోటమ్మను దర్శించుకున్న బూడి


కొట్టాం ఆలయం వద్ద ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

శృంగవరపుకోట: ఉత్తరాంధ్రుల ఇలవేలుపు కొట్టాం గ్రామంలోని కోటమ్మ అమ్మవారిని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీసమేతంగా ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న ఉపాధ్యాయ సంఘ నేతలు ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు.

యోగాతో రాజయోగం..


యోగా ఆవశ్యకతను వివరిస్తున్న డాక్టర్ త్రినాథరావు

శృంగవరపుకోట: యోగా సాధనతో రాజయోగం సాధ్యమవుతుందని మోక్షవిద్య యోగామందిర్ నిర్వాహకుడు కోటీశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాంధ్రలో భాగంగా స్థానిక శ్రీసాయి కృష్ణ ఆస్పత్రిలో యోగాపై ఆదివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ త్రినాథరావు యోగా ఆవశ్యకతను వివరించారు. అనంతరం భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యోగా ట్రైనర్ ఎస్.కోటేశ్వరరావు, పలువురు యోగా సాధకులు హాజరయ్యారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

- పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకరరావు


మంచినీటి సమస్య తీర్చాలని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న శంకరరావు తదితరులు

విజయనగరం గంటస్తంభం: తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకరరావు కోరారు. స్థానిక ఎల్బీజీ భవన్‌లో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. పట్టణంలో నెలకొన్న మంచినీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మురికివాడలలో కొత్తకాలనీలు అయిన అయ్యప్పనగర్, కేఎల్ పురం, గురజాడనగర్, తోటపాలెం, వైఎస్సార్ నగర్, రామకృష్ణ నగర్, వేణుగోపాలపురం తదితర ప్రాంతాల్లో నీరు సరఫరా చేసే కుళాయిలు లేవన్నారు. నగరవాసులకు తాగునీరు అందివ్వాలంటే 40 ఎంఎల్‌డీ నీరు అవసరం ఉండగా, 16 ఎంఎల్‌డీ నీరు మాత్రమే తాడిపూడి, నెల్లిమర్ల నుండి వస్తోందన్నారు. ఇంకా 20 ఎంఎల్‌డీ నీరు అవసరం ఉందన్నారు. ఆంధ్ర నుంచి నీటిని అక్కడున్న ఎమ్మెల్యేను, అధికారులను బతిమాలాడుకుని మరీ నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. తారకరామా రిజర్వాయర్ పూర్తి చేస్తే తప్ప సమస్య పరిష్కారం కాదన్నారు. అంతవరకు తాడిపూడి నుంచి విశాఖపట్నానికి ఇస్తున్న నీరు అగ్రిమెంట్ 2019తో పూర్తయిందన్నారు. తాడిపూడి నుంచి విశాఖ వెళ్లే నీరు విశాఖ కార్పొరేషన్ కంపెనీలకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. ఇక్కడి ప్రజాప్రతినిధులు స్పందించి, ఆ జలాలను విజయనగరం స్టోరేజ్ పాయింట్‌లకు తరలించి, నిల్వ చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే సమస్య మరింత జటిలమవుతుందన్నారు. ప్రజలు కూడా సమస్య పరిష్కారానికి ముందుకు వచ్చి పోరాడాలన్నారు. అనంతరం తాగునీటి సమస్యల పరిష్కరించాలని ప్లకార్డులు ప్రదర్శించారు. ఆయన వెంట రవికుమార్, అస్లాం తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



నెల్లిమర్ల మండలం, సీతారామునిపేట నుంచి దన్నానపేట వెళ్లే దారిలో రామతీర్థం కోనేరు వద్ద విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా కనిపిస్తోంది. ఓ పక్కకు ఒరిగిపోయి ఏ క్షణానైనా పడిపోవచ్చన్నట్లుగా ఉంది. దీంతో అటువైపుగా పొలాలకు వెళ్లే వారు, రోడ్డుపై ప్రయాణించే వారు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సరఫరా ఉన్నప్పుడు స్తంభం పడిపోతే పరిస్థితి ఏంటని అంటున్నారు. ప్రమాదం జరగకముందే అధికారులు చర్యలు తీసుకోవాలని, స్తంభాన్ని నిలబెట్టే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

–నెల్లిమర్ల రూరల్

నేత్ర శస్త్రచికిత్సకు 55 మంది ఎంపిక


శిబిరంలో నేత్ర వైద్య తనిఖీలు చేస్తున్న వైద్య సిబ్బంది

నెల్లిమర్ల: మండలంలోని జరజాపుపేటలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ వారి సహకారంతో గ్రామానికి చెందిన సాధన యువజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి హాజరైన కంటి రోగులకు వైద్యులు తనిఖీలు నిర్వహించారు. వివిధ కంటి సమస్యలతో బాధపడుతున్న 50 మందికి శస్త్రచికిత్స అవసరమని, ఆపరేషన్లకు ఎంపిక చేశారు. మొత్తం 15 గ్రామాల నుంచి 140 మంది హాజరు కాగా వారిలో 50 మంది కంటి ఆపరేషన్లకు ఎంపికయ్యారని, వారిని విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించి, ఉచితంగా ఆపరేషన్ చేయనున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నగరపంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, గరివిడి ఎంఈవో పోలుబోతు రామారావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో దళితులకు రక్షణ కరువు

నెల్లిమర్ల రూరల్: కూటమి ప్రభుత్వ పాలనలో దళితులకు రక్షణ కరువైందని జైభీమ్ రావ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టొంపల నరసయ్య విమర్శించారు. ఇదే విషయమై ఆయన ఆదివారం ఓ ప్రకటనలో మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎక్కడపడితే అక్కడే దళితులపై దాడులు జరుగుతున్నాయని, అయినా నిందితులపై ప్రభుత్వ చర్యలు శూన్యమన్నారు. అనకాపల్లి జిల్లా, దొంకాడలో ఓ వివాహ కార్యక్రమానికి లైటింగ్ పనుల నిమిత్తం వచ్చిన ఎనిమిది మంది దళిత యువకులపై దొంగతనం పేరుతో టీడీపీకి చెందిన అగ్రవర్ణాలు వారు దాడికి దిగడం విచారకరమన్నారు. అదే గొడవలో పంచాయతీ పేరుతో గ్రామానికి పిలిచి, రాత్రంతా కర్రలతో కొట్టి చిత్రహింసలకు గురిచేశారన్నారు. ఇదే ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసులు నమోదు చేయకపోవడమేంటని నిలదీశారు. దళిత హోంమంత్రి అనిత సొంత నియోజకవర్గంలోనే ఇలా దళితులకు అన్యాయం జరుగుతుంటే న్యాయం జరగకపోవడం దారుణమన్నారు. ఇవన్నీ చూస్తుంటే రాష్ట్రంలో ప్రజాపాలన సాగుతోందా లేక.. దళితులపై దాడులకే పాలన కొనసాగిస్తున్నారా అని మండిపడ్డారు. ప్రభుత్వం త్వరగా స్పందించి, దళితులపై దాడులకు దిగబడిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి గడువు పొడిగింపు


లేఅవుట్ల హద్దులు పరిశీలిస్తున్న ప్రణాళికా విభాగం అధికారులు(ఫైల్)

విజయనగరం: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎలాగైనా ఆదాయం సంపాదించాలన్న ఉద్దేశంతో అడుగులు వేస్తోంది. ఇప్పటివరకు ఇంటిపన్ను, ఆస్తిపన్ను, నీటిపన్ను తదితర వాటితో పాటు బకాయి పన్నులను వసూలు చేసే పనిని అధికారులకు అప్పగించి, నిత్యం వసూళ్ల లక్ష్యం నెరవేరేలా సంబంధిత అధికార యంత్రాంగంపై ఒత్తిడి చేస్తోంది. ఇలా వచ్చిన ఆదాయంతో పాటు మరే విధంగానైనా ఆదాయం వచ్చే అవకాశం ఉందా అనే ఆలోచనలో ప్రభుత్వం పడింది. దీనిలో భాగంగా గతంలో టీడీపీ హయాంలో అమలు చేసిన ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని తెరపైకి తీసుకువచ్చింది. పెండింగ్‌లోని లేఅవుట్ల అనుమతులపై నిబంధనలు సడలించడం ద్వారా ఆదాయం రాబట్టుకునే పనిలో నిమగ్నమైంది. గత ఐదేళ్లుగా అపరిష్కృతంగా పడి ఉన్న 2029 నాటి దరఖాస్తులు వెలికితీయించి ఆదాయం సమకూరేలా చర్యలు చేపడుతోంది. అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ(ఎల్‌ఆర్‌ఎస్) పథకం ద్వారా అప్పటి పెండింగ్ దరఖాస్తుల పూర్తికి 2025 మార్చి నెలాఖరు వరకు గడువు ఇవ్వగా, ఇప్పుడు ఆ గడువును పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం విశేషం.

గడువు పెంచినా రావడం లేదు..

అంతకుముందు ఇచ్చిన గడువులోగా దరఖాస్తుల పరిష్కారానికి దరఖాస్తుదారులెవరూ ముందుకురాకపోవడంతోనే గడువు పెంచారని, ఈసారైనా దరఖాస్తులు పరిష్కారమవుతాయా అని అంతా అనుకుంటున్నారు. లేఅవుట్ల అనుమతుల విషయంలో చిక్కులు తొలగిస్తామని చెబుతూ ఆదాయం సమకూర్చుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తుంటే ఆశించిన స్థాయిలో ఫలితాలు కనిపించడం లేదు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అప్పటి 609 దరఖాస్తుల్లో 471 పరిష్కరించారు. షార్ట్‌ఫాల్‌లో 138 వరకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. లేఅవుట్ ప్లానింగ్ సరిగా లేకపోవడం, సౌకర్యాలు కల్పించకపోవడం, సంబంధిత ధ్రువీకరణ పత్రాలు సమర్పించకపోవడం వంటి కారణాలతో దరఖాస్తులు తిరస్కరించారు. ప్రస్తుతం అవే దరఖాస్తులు పరిష్కరిస్తామని డబ్బుల కోసం ప్రభుత్వం చూస్తుండడంతో అభివృద్ధి పేరిట నిబంధనలు సడలించినట్లు సర్కారు చెప్పుకొస్తుండడం గమనార్హం. కార్పొరేషన్ పరిధిలోని దరఖాస్తులను పరిష్కరించుకునేందుకు ముందుకు రావాలని కమిషనర్ పి.నల్లనయ్య కోరారు. ఎల్‌ఆర్‌ఎస్‌పై ఆయా వర్గాల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

వ్యవసాయ పనుల్లో అన్నదాత..


తలారి సమీపంలో దుక్కు చేస్తున్న రైతు

లక్కవరపుకోట: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి నారుమడుల తయారీలో రైతన్నలు బిజీబిజీగా ఉన్నారు. ఇప్పటికే పొలాల్లో ఎరువులు చల్లి రెండు,మూడు పర్యాయాలు దుక్కులు చేపట్టారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు సాగుకు అనుకూలమని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. కాగా నేటికీ మండల కేంద్రాలకు వరి విత్తనాలు చేరకపోవడంతో రైతులు ఓ పక్క ఆందోళన చెందుతున్నారు. ప్రకృతి సహకరించినా ప్రభుత్వం సహకరించడం లేదని రైతులు వాపోతున్నారు. గతంలో ఈ సమయానికి రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం నగదు జమచేసింది. అలాగే విత్తనాలు కూడా అందుబాటులో ఉంచింది. కాని కూటమి ప్రభుత్వ హయాంలో రైతులకు ఒరిగిందేమీ లేదని పలువురు చెబుతున్నారు.

అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలి..


అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రారంభిస్తున్న అడ్డూరి సీతబాబు, స్థానిక ప్రజాప్రతినిధులు

గుర్ల: యువత అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుచుకోవాలని అంబేడ్కర్ ఇండియన్ మిషన్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి సీతబాబు అన్నారు. మండలంలోని గుజ్జింగివలసలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అంబేడ్కర్ అందరివాడని.. విద్యార్థులు , యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రతి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు అంబేడ్కర్ ఇండియన్ మిషన్ సంస్థ కృషి చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు కెల్ల భీమారావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అట్టాడ రామకృష్ణ , మాజీ సర్పంచ్ గొర్లె రాముునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు పాలు, గుడ్లు పంపిణీ


క్రీడాకారులకు పాలు, గుడ్లు ఇస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు, తదితరులు

శృంగవరపుకోట : పట్టణంలోని నారాయణ్ కేంబ్రిడ్జ్ పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ షటిల్ క్యాంప్‌లో పాల్గొన్న క్రీడాకారులకు ఆదివారం పాలు, గుడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ..క్రీడల వల్ల విద్యార్థుల్లో శారీరక, మానసిక ఆత్మస్థైర్యం పెరుగుతుందని చెప్పారు. క్రీడా శిబిరం నిర్వహణకు సహకారం అందిస్తున్న స్థానికులు, మిత్రులకు ఎమ్మెల్సీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌సీ అధ్యక్షుడు డాక్టర్ సత్యశేఖర్, మంధా సుబ్బారావు, ఏఎస్ వెంకటరావు, ఎ.మోహన్, రమేష్, కోచ్ పి.శ్రీరాములు పాల్గొన్నారు.

గిరిజన సమస్యలపై వినతి


విశాఖ ఎంపీ భరత్‌కు వినతిపత్రం అందజేస్తున్న సన్యాసినాయుడు, తదితరులు

శృంగవరపుకోట: ఎస్.కోట మేజర్ పంచాయతీ పరిధిలో ఉన్న రేగ పుణ్యగిరి గ్రామస్తులు పలు సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని, వాటిని పరిష్కరించాలని కోరుతూ జనసేన నాయకుడు ఒబ్బిన సన్యాసినాయుడు ఎంపీ శ్రీభరత్‌కు ఆదివారం వినతిపత్రం అందజేశారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భవన శంకుస్థాపన కార్యాక్రమానికి హాజరైన ఎంపీ భరత్‌ను పలువురు గిరిజనులు కలిశారు. ఈ సందర్భంగా జనసేన నాయకుడు సన్యాసినాయుడు మాట్లాడుతూ.. రూ.4 కోట్లతో మంజూరైన రోడ్డు నిర్మాణం ఇంతవరకూ జరగలేదన్నారు. డోలీమోతల నుంచి గిరిజనుల్ని కాపాడాలని.. రెవెన్యూ అధికారులతో సర్వే చేయించి పోడు పట్టాలు ఇప్పించాలని.. మినీ అంగన్‌వాడీ కేంద్రాలు మంజూరు చేయాలని కోరారు.

జనరల్ నోటీసు

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా! ఈ దిగువ షెడ్యూల్ దాఖల ఆస్తిని నా క్లయింట్ అయిన విజయనగరం జిల్లా, గజపతినగరం మండలం, జన్నాం అగ్రహారం గ్రామం కాపురస్తులు లోగిశ లక్ష్మునాయుడు గారి కుమారుడు శ్రీ లోగిశ శంకరరావు గారు ఇచ్చిన భోగట్టాపై ఈ పబ్లిక్ నోటీసు జారీ చేయడమైనది. ఈ దిగువ సుదహరించిన షెడ్యూల్ దాఖల ఆస్తిలో హక్కుదారు అయిన శ్రీమతి రంగాబత్తుల జోగులమ్మ భర్త రంగాబత్తుల శ్రీనివాసరావు గారికి గరిమెళ్ళ శ్యామల కోటేశ్వరరావు తండ్రి లేటు గరిమెళ్ల సీతారామమూర్తి గారి నుండి రిజి క్రయదీటి తేది. 27-08-2018 SRO విజయనగరం వెస్ట్ ద్వారా దఖలు పడినది. ఆమె స్వాధీన అనుభవం కలిగి ఉండి ఇండోస్టార్ వారి రుణం మినహా ఎటువంటి ఇతరత్రా లావాదేవీలు లేనటువంటి ఆస్తిని నా క్లయింటు క్రయం పొందుటకుగాను అడ్వాన్సు చెల్లించి క్రయపులోని పొందుచున్నారు. సదరు ఆస్తిపై ఎటువంటి క్లయిములు, ఆక్షేపణలు వగైరాలు ఎవరికైనా ఉన్నయెడల ఈ ప్రకటన వెలువడిన 15 రోజులులోగా తెలియపరచవలెను. లేనియెడల గడువు దరిమిలా వచ్చిన అభ్యంతరములు, క్లయిములు వగైరాలు పరిశీలించబడవు.

షెడ్యూల్ ఆస్తి వివరములు

షెడ్యూలు: విజయనగరం జిల్లా, విజయనగరం వెస్ట్ సబ్‌రి. యిలాకా, విజయనగరం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో చేరిన కణపాక, దాకలివీధిలో యున్నటువంటిన్నీ, డోర్ నెం. 1-24/2-29రు లైనులో బాహ్యావీధి (రాజవీధిలో రోడ్డునకు దక్షిణ శ్రేణిలో యున్నటువంటిన్నీ, సర్వే నెం. 18రులో భాగమైనటువంటిన్నీ, గ్రౌండ్‌ఫ్లోర్, ఫస్ట్‌ఫ్లోర్ గల స్థిరాస్తి ఆర్.సి.సి. స్లాబ్ మేడ ఇల్లు, యిందుల నివేశనములో ఫస్ట్‌ఫ్లోర్ ఆర్.సి.సి. స్లాబ్ పోర్షన్ ఈ క్రయ పురోతి దాఖలా ఆస్తియై యున్నది. సదరు ఆస్తికి కొలతలు, హద్దులు వివరము: **1వ ప్రతి కొలతలు: తూర్పు పడమరలకు:** 25 అడుగులు (7.62 మీ.లు), **ఉత్తర దక్షిణములకు:** 20 అడుగులు (6.09 మీ.లు), **విస్తీర్ణం:** 55.55 చదరపు గజములు (46.44 చ.మీ.).

హద్దులు: తూర్పు: ముకుందరావు గారి ఖాళీ స్థలము. **దక్షిణం:** రోడ్డు. **పడమర:** జి.యం. నారాయణమూర్తి గారి ఇల్లు. **ఉత్తరం:** గరిమెళ్ల వెంకట రమణమూర్తి గారి స్థలము. **2వ ప్రతి కొలతలు: తూర్పు పడమరలకు:** 25 అడుగులు (7.62 మీ.లు), **ఉత్తర దక్షిణములకు:** 20 అడుగులు (6.09 మీ.లు), విస్తీర్ణము: 55.55 చదరపు గజములు (46.44 చ.మీ.)

హద్దులు: తూర్పు: ముకుందరావు గారి ఖాళీ స్థలము. **దక్షిణం:** ఇందుల 1వ ప్రతి. **పడమర:** జి.యం. నారాయణమూర్తి గారి ఇల్లు. **ఉత్తరం:** భాస్కర సూర్యనారాయణ గారి ఖాళీ స్థలము.

పై రెండు ప్రతులు వెరశి 111.10 చదరపు గజములు విస్తీర్ణంగల స్థలములో అవిభక్తపు, అవిభాగపు 1/2వ వంతు అనగా 55.55 చదరపు గజములు విస్తీర్ణంగల స్థలమున్నూ, సదరు స్థలమునందు నిర్మించినటువంటి ఆర్.సి.సి. స్లాబ్ మేడ ఇల్లు యిందుల నివేశనములో 1,000 చదరపు అడుగులు గల ఫస్ట్‌ఫ్లోర్ ఈ క్రయ పురోతి దాఖలా ఆస్తియై యున్నది.

P.V.S.J.MOHANARAO
S.V. PAVAN KUMAR
Advocates
ANAKAPALLE. Cell: 9949450950

తగ్గుతున్న చెరువుల విస్తీర్ణం

- ఉపాధి హామీ పనులపై పర్యవేక్షణ కరువు
- అడ్డదిడ్డంగా మట్టిని పోస్తున్న వేతనదారులు


చెరువు గర్భంలోకి వేసిన మట్టి

చీపురుపల్లి రూరల్ (గరివిడి): చెరువుల విస్తీర్ణాలు ఏడాదికేడాదికీ తగ్గిపోతున్నాయి. ఒకవైపు చెరువు భూగర్భాలను రైతులు కొంత ఆక్రమించగా.. మరోవైపు ఉపాధి హామీ పనుల నిర్వహణలో లోపం కారణంగా చెరువులు ఉనికి కోల్పోతున్నాయి. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఉపాధి హామీ పనులు సక్రమంగా చేపట్టకపోవడం వల్ల చెరువుల విస్తీర్ణాలు కుచించుకుపోతున్నాయని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఉపాధి పనులను అధికారుల పర్యవేక్షించకపోవడంతో వేతనదారులు చెరువుల్లో తవ్విన మట్టిని మళ్లీ చెరువు గర్భంలోనే వేస్తుండడంతో చెరువుల విస్తీర్ణాలు తగ్గిపోతున్నాయని పలువురు చెబుతున్నారు. చెరువులను లోతుగా చేసి నీటి నిల్వ సామర్థ్యం పెంచాలనే ఉద్దేశంతో అధికారులు చెరువుల్లో ఉపాధి పనులు చేపడుతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు. నియోజక వర్గంలోని చీపురుపల్లి, గరివిడి, గుర్ల, మెరకముడిదాం మండలాల్లోని అన్ని పంచాయతీల్లో కూడా ఉపాధి పనులు చేపడుతున్నారు. ఈ పనులు జరిగే సమయంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ దగ్గరుండి సలహాలు అందిస్తూ పనులను చేయించాలి. చెరువుల్లో తవ్విన మట్టిని చెరువు గట్టుకు దట్టంగా వేస్తూ నడవడానికి వీలుగా ఉండే విధంగా ఏర్పాటు చేయాలి. అయితే ఫీల్డ్ అసిస్టెంట్లు తమ బాధ్యతలను మేట్‌లకు అప్పగించి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో ఉపాధి పనుల వల్ల చెరువుల లోతు పెరగాల్సింది పోయి విస్తీర్ణం తగ్గిపోతోందని రైతులు వాపోతున్నారు. అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందికి అవగాహన కల్పించకపోవడం.. పనులు జరిగే విధానాన్ని పర్యవేక్షించకపోవడంతో ఈ సమస్య ఏర్పడిందని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువుల్లో ఉపాధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్

బొబ్బిలి: విద్యతోనే పిల్లలకు బంగారు భవిష్యత్ సాధ్యమని, విద్యార్థులను ప్రోత్సహించడం కోసం సమాజంలో అంతా ముందుకు రావాల్సిన అవస రం ఉందని డీఎస్పీ జి.భవ్యారెడ్డి అన్నారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముస్లిం విద్యార్థుల అభినందన సభతో పాటు కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని స్థానిక షాదీ ఖానాలో హుదా ము స్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. అతిథిగా హాజరైన డీఎస్పీ విద్యార్థులకు మెమెంటోలు ప్రదానం చేసి, దిశా నిర్దేశం చేశా రు. మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ బాబు, కారుణ్య ఫౌండేషన్ అధ్యక్షుడు జేసీ రాజు, హుదా అధ్యక్షుడు మహ్మద్ రఫీ, కార్యదర్శి షేక్ జాఫర్, మదర సా పాఠశాల ప్రిన్సిపాల్ అబుల్ కలాం, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు రియాజుల్లా ఖాన్ పాల్గొన్నారు.